క్లుప్తంగా

లక్ష్మీ నరసింహస్వామి సేవలో ఎమ్మెల్యే వైవీఆర్



కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: తెలంగాణ రాష్ట్రంలోని యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అర్చకులు ఎమ్మెల్యే వైవీఆర్‌కు ఆశీర్వచనం చేశారు. శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

స్టోరేజ్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద సంతకాలు సేకరిస్తున్న రైతు సంఘం నాయకులు

గార్లదిన్నె: అనంతపురం మార్కెట్ యార్డులోనే చీనీకాయలు బహిరంగ వేలం వేయాలని రాయలసీమ రైతు సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ మాట్లాడారు. ఉమ్మడి జిల్లా రైతులు పండించిన చీనీ పంటను అమ్ముకునేందుకు గుంటూరు మార్కెట్‌కు వెళ్తున్నారన్నారు. అనంతపురం మార్కెట్‌లోనే బహిరంగా వేలం నిర్వహించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో రైతులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రతి మండలానికి ఒక స్టోరేజ్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. కమిషన్ 5 శాతం మాత్రమే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మల్లన్న, సుబ్బన్న, వన్నూరప్ప, పవన్ కుమార్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

21న యోగాసనం



తరిమెలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శింగనమల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 21వ తేదీన యోగాసనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తరిమెల ఆయుర్వేద వైద్యాధికారి మాధవి అన్నారు. సోమవారం మండలంలోని తరిమెలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్

గుంతకల్లుటౌన్: కార్పొరేట్ విద్యాలయాల స్థాయికి అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు. సోమవారం పట్టణంలోని రామిరెడ్డి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఒకప్పుడు చిన్నపిల్లల ఆలనాపాలనకే పరిమితమైన అంగన్‌వాడీ కేంద్రాలు పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా రూపుదిద్దుకున్నాయని చెప్పారు. అలాగే వాల్మీకినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, మహిళా సంరక్షణ కార్యదర్శి వాణి తదితరులు ప్రీ స్కూల్‌పై అవగాహన కల్పించారు.

మొక్కలను సంరక్షించుకోవాలి



మొక్కలు నాటుతున్న జిల్లా అడిషనల్ ఎస్పీ హనుమంతు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

గార్లదిన్నె: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి నీరు పోసి సంరక్షించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ హనుమంతు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కోటంకలో నూతనంగా నిర్మించిన శివాలయంలో పూజలు చేయించారు. అనంత ప్రకృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కల పెంపకంతో పచ్చదనం పెంపొందుతుందన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంఈఓలు

గుంతకల్లు రూరల్/యల్లనూరు/బుక్కరాయసముద్రం/శింగనమల/పెద్దవడుగూరు/గార్లదిన్నె: గుంతకల్లు ఎంఈఓ–2గా సుబ్బరాయుడు, యల్లనూరు ఎంఈఓ–2గా పరమేశ్వర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అలాగే బీకేఎస్ ఎంఈఓ–2గా లింగా నాయక్, శింగనమల ఎంఈఓ–2గా శివప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. పెద్దవడుగూరు ఎంఈఓ–2గా గురుప్రసాద్, గార్లదిన్నె ఎంఈఓ–2గా వెంకటరమణ నాయక్ ఎమ్మార్సీలో బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

పేద విద్యార్థుల ప్రతిభకు పట్టం



యల్లనూరు: పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



గుంతకల్లు రూరల్: నెలగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



గుత్తి: ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

- జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పురస్కారాల ప్రదానం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. 546 మార్కులు సాధించిన ఎం.చేతన్‌కి రూ.3 వేలు, 444 మార్కులు సాధించిన పి.మనోజ్ కుమార్‌కి రూ.2 వేలు, 439 మార్కులు సాధించిన సి.సుశ్మితకు రూ.1,000 చొప్పున నగదు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం స్వర్ణలత, ఉపాధ్యాయుడు శ్రీధర్‌గౌడ్, పీసీ కమిటీ చైర్మన్ నాగభూషణం మాట్లాడారు. సీఎం జగన్ ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దడంతో నేడు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య పెరుగుతోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, వెంకటశేషయ్య, రంగస్వామి, జయనిర్మల, వేణుగోపాల్, సీఆర్పీ లలితమ్మ పాల్గొన్నారు.

- **గుంతకల్లు రూరల్:** రాష్ట్రంలో విద్యాభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొనియాడారు. సోమవారం మండలంలోని నెలగొండ, వైటీ.చెరువు, తిమ్మాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అనంతరం సర్పంచులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులను ఘనంగా సత్కరించారు.
- **గుత్తి:** పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన శిరీష (526), వైష్ణవి (494), చాడేశ్వరి (476)కి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ , ఎంపీపీ విశాలాక్షి, ఎంఈఓ రవి నాయక్ తదితరులు నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాగా కష్ట పడి చదవాలని విద్యార్థినులకు సూచించారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుతారన్నారు. అనంతరం పురస్కారాలు అందుకున్న ముగ్గురు విద్యార్థినులను సన్మానించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఎస్‌ఓ రుద్రాక్షి, మున్సిపల్ కౌన్సిలర్ బాణాల లక్ష్మీరాణి, వార్డు ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, యువ నాయకుడు షఫీ, మహ్మద్ పాల్గొన్నారు.
- **యల్లనూరు:** కస్తూర్బా విద్యాలయంలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. 540 మార్కులు సాధించిన అమృతకు రూ.3 వేలు, 481 మార్కులు సాధించిన తేజశ్వినికి రూ.2 వేలు, 474 మార్కులు సాధించిన నందినికి రూ.1000 చొప్పున నగదు బహుమతును ప్రత్యేకాధికారి మాధవి అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారిణి మాట్లాడుతూ.. కస్తూర్బాలో చదివి ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురి విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశామన్నారు.
- **పెద్దపప్పూరు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సన్మానించారు. పి.రోహిత్‌రెడ్డికి రూ.3 వేలు, జి.పృథ్వీకి రూ.2 వేలు, వై.పూర్ణశ్రీకి రూ.1,000 చొప్పున నగదు, ప్రశంశా పత్రాలు అందజేశారు. అలాగే చాగల్లు గ్రామానికి చెందిన విశ్రాంత వ్యవసాయ అధికారి పి.హనుమంతరెడ్డి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు వరుసగా రూ.5 వేలు, 3 వేలు, రూ.2 వేలు చొప్పున అందేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆదినారాయణరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్, ఎంపీటీసీ, సర్పంచ్ పాల్గొన్నారు.
- **పెద్దవడుగూరు:** ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ రాముడు, మాజీ ఎంపీపీ గూడూరు పెద్ద ఓబుళరెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని లక్ష్ముంపల్లి, పెద్దవడుగూరులోని కేజీబీవీ, జెడ్పీ పాఠశాలల్లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడం జరుగుతోందన్నారు. పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు, మెడల్స్ అందజేశారు.



గుత్తి రూరల్: విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు



పెద్దపప్పూరు: విద్యార్థినికి ప్రశంసాపత్రం ఉపాధ్యాయులు, తదితరులు

పైప్‌లైన్ ఏర్పాటులో జాప్యం తగదు



ఫిల్టర్ మీడియా ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ భవానీ, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: పట్టణ శివారులోని కొత్త సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ పంప్‌హౌస్ వద్ద జరుగుతున్న ఫిల్టర్ మీడియా ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎంఈ ఈశ్వరయ్యలతో కలిసి వారు కొత్త ఫిల్టర్‌మీడియా ఏర్పాటు పనులను పరిశీలించారు. నీటిని శుద్ధి చేసే విధానం, ప్రతిరోజూ ఎన్ని లీటర్ల నీటిని శుద్ధి చేస్తారని ఆరా తీశారు. గతంలో ఉన్న ఫిల్టర్ మీడియాలు నీటిని సరిగ్గా శుద్ధి చేయడం లేదని తెలిపారు. వాటి స్థానంలో కొత్త ఫిల్టర్ మీడియా ఏర్పాటు చేయిస్తున్నామని అధికారులు తెలియజేశారు. ఒకట్రెండు రోజుల్లోపు పనులు పూర్తికాగానే యథావిధిగా నీటి సరఫరా జరుగుతందని వెల్లడించారు. కసాపురం రోడ్డు చివరి వరకు నీటి సరఫరా చేసేందుకు రూ.10.50 కోట్ల అమృత్ నిధులతో జరుగుతున్న పైప్‌లైన్ ఏర్పాటు, కొత్త ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. పనులను పర్యవేక్షిస్తున్న పబ్లిక్‌హెల్త్ అధికారులు కూడా నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ



మాట్లాడుతున్న నార్పల సత్యనారాయణ రెడ్డి

గుత్తి: పట్టణంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, ఎంఈఓ రవి నాయక్ , ఎస్‌ఓ రుద్రాక్షి, ఉపాధ్యాయులు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నార్పల: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్నీల సుప్రియ, ఎంపీపీ నాగేశ్వరావు, జెడ్పీ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ, ఎంఈఓ క్రిష్ణయ్య, ఎంపీటీసీ వెంకటలక్ష్మమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

విష ప్రయోగంతో 195 కోళ్లు మృతి



మృతి చెందిన కోళ్లు

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లిలో విష ప్రయోగంతో సోమవారం సుమారు 195 కోళ్లు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామస్తులకు చెందిన నాటు కోళ్లు సోమవారం ఉదయం ఆహారం కోసం బయటకు వెళ్లాయి. అయితే పలు ప్రదేశాల్లో ఉన్న ఫళంగా కోళ్లు కుప్పకూలి మృత్యువాత పడుతున్నాయి. కాగా గ్రామంలో మూడు రోజుల క్రితం ఓ మహిళకు చెందిన నాటు కోడి మృతి చెందింది. ఆమె కోడి మృతి చెందిందనే కోపంతో గ్రామంలోని కోళ్లకు విషం పెట్టిందని గ్రామస్తులు అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సదరు మహిళను పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. కోళ్ల మృతికి తనకు ఎలాంటి సంబంధం లేదని మహిళ పోలీసులకు చెబుతోంది. అయితే గ్రామస్తులు మాత్రం ఆ మహిళ మీదే చెబుతున్నారు. గ్రామంలో సుమారు 195 కోళ్ల మృతితో సుమారు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన కోళ్లను గ్రామస్తులు గ్రామ శివారుకు తీసుకెళ్లి పూడ్చిపెట్టారు. గ్రామస్తుల ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేస్తున్నారు.

క్రికెట్ పెట్టిన చిచ్చు





గాయపడిన నాగరాజు, ఓబులేసు

యాడికి: మండలంలోని కేశవరాయుని పేటలో సోమవారం ఇరువర్గాల మధ్య క్రికెట్ చిచ్చు రేపింది. ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఓబులేసు, నాగరాజు కుటుంబాలకు కొంతకాలంగా పాత గొడవలు ఉన్నాయి. సోమవారం సాయంత్రం నాగరాజు కుమారులు ఇంటి వద్ద క్రికెట్ ఆడుకుంటున్నారు. దారిలో క్రికెట్ ఆడకూడదని ఓబులేసు చెప్పడంతో పిల్లలు ఈ విషయాన్ని తండ్రి నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు. చిన్న పిల్లలు ఆడుకుంటుంటే నువ్వు ఎవడిరా వద్దని చెప్పడానికి అంటూ నాగరాజు ఓబులేసుతో వాగ్వాదానికి దిగాడు. కోపోద్రిక్తులైన ఇరు కుటుంబాలు కట్టెలతో కొట్టుకున్నారు. ఈ దాడిలో ఓబులేసు, నాగన్న, ప్రసాద్ ముగ్గురూ నాగరాజుపై దాడి చేశారు. ఈ ఘటనలో నాగరాజు పళ్లు ఊడిపోయి రక్త గాయాలయ్యాయి. అలాగే నాగరాజు, అతడి భార్య, నగేష్, నరేష్‌లు ఓబులేసు తలపై కొట్టడంతో గాయాలయ్యాయి. గాయపడిన వారికి రాయల చెరువులో ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



మస్టర్లను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

నార్పల: ఎలాంటి అవకతవకలు లేకుండా ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల వ్యాప్తంగా జరుగుతున్నా ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి పథకం కింద మంజూరైన పండ్లతోటలను సందర్శించారు. యాజమాన్య పద్ధతులపై రైతులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలసలు నివారించి కూలీలకు పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, ఏపీఓలు ఓబన్న, లక్ష్మీకాంతమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

తాడిపత్రి: అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం నుంచి గుత్తి వైపునకు వెళ్తున్న ఓ సిమెంట్ లారీ సోమవారం రాత్రి ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని బుగ్గ సమీపంలోని యాడికి రహదారిలో ఉన్న పెన్నా సిమెంట్ రైల్వే గేట్ వద్ద చోటు చేసుకుంది. గుంతను తప్పించబోయి లారీ అదుపు తప్పి బోల్తాపడింది. డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.

సంక్షిప్త సమాచారం

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోండి

పెద్దవడుగూరు: మండల పరిధిలోని రాంపురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రాజుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, ఉపాధిహామీ కూలీలు కోరారు. సోమవారం ఎంపీడీఓ కుళ్లాయిస్వామికి వినతిపత్రం అందజేశారు. రెండు ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అతడు కూలీలతో దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తెలిపారు. కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణంలో వివాదం

పుట్లూరు: మండలంలోని తక్కళ్లపల్లిలో సోమవారం సిమెంట్ రోడ్డు నిర్మాణంలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, పంచాయతీ అధికారులు ఆక్రమణలను తొలగించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు నిర్మాణానికి కొందరు అడ్డుపడుతుండటంతో సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ వెంకటప్రసాద్‌లు సిబ్బందితో కలిసి పనులను అడ్డుకుంటున్న వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాలకు చెందిన 11 మందిని బైండోవర్ చేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

విన్సెంట్ ఫెర్రర్‌కు నివాళి

గార్లదిన్నె: గార్లదిన్నెతో పాటు కల్లూరు, యర్రగుంట్ల, మర్తాడు, బూదేడు, కోటంకలో సోమవారం ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి నిర్వహించారు. ఫెర్రర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గార్లదిన్నె శ్మశాన వాటిలో గ్రామస్తులు కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కదిరెప్ప, దేవదత్తు, నల్లప్ప, నాగేంద్ర, నరసింహులు, పాల్గొన్నారు.

బీకేఎస్ డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రతాప్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రతాప్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఉరవకొండ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

మున్సిపల్ ఏఈగా సాయినాథ్ బాబు

గుత్తి: గుత్తి మున్సిపల్ ఏఈగా సాయినాథ్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఈయన ఎమ్మిగనూరులో ఏఈగా విధులు నిర్వర్తించారు. గతంలో ఇక్కడ ఏఈగా పని చేస్తున్న శరత్ చంద్ర ఎమ్మిగనూరుకు బదిలీ అయ్యారు.

మున్సిపల్ టీపీఎస్‌గా మహబూబ్ జాన్

గుత్తి: మున్సిపల్ టీపీఎస్ (టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్)గా మహబూబ్ జాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె విజయనగరం మున్సిపాలిటీలో టీపీఎస్‌గా పని చేశారు. ఇక్కడ టీపీఎస్‌గా పని చేస్తున్న అబ్దుల్ సత్తార్ గుంతకల్లు మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, మున్సిపల్ డీఈ ఇంతియాజ్ అలీ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి తదితరులు టీపీఎస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

నార్పల: విద్యార్థులు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు దూరంగా ఉండాలని సీఐ అస్రర్ బాషా సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, బాల్య వివాహాలు, దిశా యాప్‌లపై అవగాహన కల్పించారు. కళాశాలకు వెళ్లే విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలతో అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు.

పశుబీమాపై అవగాహన కల్పించండి

పుట్లూరు: వైఎస్సార్ పశుబీమాపై పాడి రైతులు, గొర్రెల కాపరులకు అవగాహన కల్పించాలని యల్లనూరు ఏడీఏ ఖదీర్ సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని పశువైద్యశాల ఆవరణలో రైతు చెల్లించాల్సిన వాటా, ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంపై వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి నాగసువర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి డిగ్రీలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వివిధ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్ఞానేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుండి 30వ తేదీలోపు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలన్నారు. జూలై 3న సీట్ల కేటాయింపు, 4వ తేదీ నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

3న అన్నాభిషేకం

తాడిపత్రి టౌన్: జూలై 3వ తేదీన గురు పౌర్ణమిని పురస్కరించుకుని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రాజరాజేశ్వరీ దేవిని శాకాంబరీగా అలంకరిస్తామన్నారు. భక్తులు పాల్గొనాలని సూచించారు.

నేడు మండలస్థాయి క్రీడాపోటీలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఉదయం మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ గురుప్రసాద్, ఎంపీడీఓ విజయ భాస్కర్ సోమవారం తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు ఈ 22వ తేదీన జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

పిల్లలను సురక్షితంగా ఇళ్లకు చేర్చాలి



మాట్లాడుతున్న ఎంవీఐ రాజగోపాల్

యాడికి: కండీషన్‌లో ఉన్న బస్సులనే నడపాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ ప్రైవేట్ స్కూల్ బస్సు యజమానులు, డ్రైవర్లకు సూచించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 16 బస్సులను పరిశీలించారు. ఎంవీఐ మాట్లాడుతూ.. పాఠశాల యాజమాన్యం వాహనాల్లో బడి పిల్లలను సురక్షితంగా ఇళ్లకు చేర్చాలన్నారు. పిల్లలను ఎక్కించుకునేందుకు, దింపేందుకు ఒక వ్యక్తి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే సహించబోం



సచివాలయ అద్దాలు ధ్వంసం చేసిన దృశ్యం

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని సీఐ నాగార్జునరెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక అనంతసాగర్ కాలనీలో ఉన్న సచివాలయం–3 అద్దాలను ఆదివారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం సచివాలయ సిబ్బంది నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఫిర్యాదు మేరకు ఓ గంటలోనే అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తాడిపత్రి: ఆలూరు గ్రామానికి చెందిన కొత్తపల్లి రంగనాథ్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తుండగా సజ్జలదిన్నె వద్ద పట్టుకున్నట్లు సెబ్ సీఐ విజయ్ కుమార్ తెలిపారు. అనంతరం ట్రాక్టర్‌ను రూరల్ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పెద్దవడుగూరు: మండల పరిధిలోని పి.వీరన్నపల్లిలో ఓ వివాహితను వేధిస్తున్న దుర్గన్న అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితుడు కొద్ది రోజులుగా మహిళను వేధిస్తున్నాడు. పలుమార్లు హెచ్చరించినా ఫలితం లేకపోవడంతో మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని ఎవరైనా మహిళలు, బాలికలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాడిపత్రి: మండల పరిధిలోని రావివెంకటాంపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. పట్టణంలోని శ్రీనివాసపురానికి చెందిన కృష్ణారెడ్డి, హజరత్ ద్విచక్ర వాహనంలో అనంతపురం వైపు బయలుదేరారు. రావివెంకటాంపల్లి శివాలయం వద్దకు రాగానే వెనుక వైపు నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణారెడ్డికి స్వల్పంగా.. హజరత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హజరత్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యల్లనూరు: మండలంలోని వేములపల్లికి చెందిన నల్లపరెడ్డి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. రెండు రోజుల క్రితం చుక్కలూరు పారిశ్రామికవాడలోని శ్రీనిధి నల్లబండల పాలీష్ పరిశ్రమలో నిద్రిస్తున్న నల్లపరెడ్డి, అతడి భార్య సరస్వతిపై రామేశ్వరరెడ్డి పెట్రోల్ పోసి నిప్పు అంటించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కాలిపోయిన నల్లపరెడ్డి మృత్యువాతపడ్డాడు. వేములపల్లిలో అతడి అంత్యక్రియలు నిర్వహించారు. సర్పంచ్ అశోక్‌కుమార్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

తాడిపత్రి: నిబంధనల అతిక్రమిస్తున్న తాడిపత్రి పట్టణ, మండల పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎంఈఓ ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అఖిల్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు, భాగ్ కన్వీనర్ భూపాల్, నగర కార్యదర్శి హరి, నాయకులు మనోజ్, హర్ష పాల్గొన్నారు.